కుదిరితే కప్పు కాఫీ!

చర్చించుకుని సమస్య పరిష్కరించుకోండి

విడాకుల కేసులో దంపతులకు సుప్రీం కోర్టు సూచన

న్యూఢిల్లీ: విడాకుల కోసం వచ్చిన దంపతులకు సుప్రీంకోర్టు సోమవారం చక్కని సలహా ఇచ్చింది. రాత్రికి ఇద్దరూ కలిసి భోజనం చేయాలని, ఆ సమయంలో చర్చించుకుని, సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని చెప్పింది. 'మీకు మూడేళ్ల బిడ్డ ఉంది. మీ ఇరువురి మధ్య ఆత్మగౌరవానికి సంబంధించిన ఇబ్బందులు ఏమి ఉన్నాయి? మా క్యాంటీన్ దీనికి సరైనది కాకపోవచ్చు. మేం మీకు ఓ డ్రాయింగ్ రూమ్‌ను ఇస్తాం. రాత్రి భోజనం వద్ద ఇద్దరూ కలుసుకోండి. ఓ కప్పు కాఫీ తాగేటపుడు ఎంతో జరగవచ్చు' అని ధర్మాసనం తెలిపింది. 'గతం గతః. అది ఓ చేదు గుళిక అనుకుని మర్చిపోండి. భవిష్యత్తు గురించి ఆలోచించండి' అని హితవు పలికింది. 'మీ నుంచి సానుకూల స్పందనను ఆశిస్తున్నాం' అని తెలిపింది. తదుపరి విచారణను నేటికి (మంగళవారం) వాయిదా వేసింది. ఈ కేసులో భార్య ఫ్యాషన్ డిజైనర్. ఆమె తన మూడేళ్ల బిడ్డతో కలిసి విదేశాలకు వెళ్లేందుకు కోర్టు అనుమతి కోరారు. ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ సలహా ఇచ్చింది.

విదేశీ భార్యలు వద్దు

బంగ్లాదేశ్‌లోని తమ పౌరులకు చైనా అడ్వైజరీ

బీజింగ్: బంగ్లాదేశ్ యువతులను పెళ్లాడే విషయంలో జాగ్రత్తగా ఉండాలని ఆ దేశంలోని తమ పౌరులకు చైనా రాయబార కార్యాలయం సూచించింది. మ్యారేజ్ స్కామ్స్ పెరుగుతున్న నేపథ్యంలో విదేశీ భార్యల కొనుగోలు వంటి ఆలోచనను పక్కనపెట్టాలని, అక్రమ వివాహ ఏర్పాట్లకు దూరంగా ఉండాలని హెచ్చరించింది. చైనాలో పెరుగుతున్న వధువు అక్రమ రవాణాల నేపథ్యంలో ప్రభుత్వం ఈ హెచ్చరికలు జారీచేసింది. చైనాలో నిన్నమొన్నటి వరకు ఒకే సంతానం విధానం అమలు చేయడంతో దాదాపు 3 కోట్ల మంది చైనా పురుషులు భాగస్వామి దొరక్క ఇబ్బంది పడుతున్నారు. దీంతో విదేశీ వధువులకు డిమాండ్ పెరిగింది. అదే సమయంలో వివాహం పేరుతో బంగ్లాదేశ్ మహిళలను చైనాకు అక్రమంగా తరలిస్తున్న ఘటనలు వెలుగుచూశాయి.



అధ్యక్షుడైతే నాకేంటి?

ఫ్రాన్స్ అధ్యక్షుడి చెంప చెళ్లుమనిపించిన భార్య

వియత్నాం: ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మాక్రాన్‌ను ఆయన భార్య బ్రిగెటి మాక్రాన్ చెంపచెళ్లుమనిపించింది. ఆయన సోమవారం వియత్నాం పర్యటనకు వెళ్లారు. ఈ క్రమంలో విమానం దిగుతుండగా మాక్రాన్ చెంపపై ఆయన భార్య కొడుతున్నట్టుగా కనిపిస్తున్న వీడియో ఒకటి ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నది. దీనిపై ఫ్రాన్స్ అధ్యక్ష కార్యాలయం స్పందించింది. అధ్యక్షుడిని ఆయన భార్య కొట్టలేదని, కేవలం టీజ్ చేసేందుకు మాత్రమే అలా చేసిందని తెలిపింది. అయితే దీనిపై మాత్రం నెటిజన్లు తీవ్రంగా స్పందిస్తున్నారు. అధ్యక్షుడిపై అందిరి ముందు అలా చేయిచేసుకోవడం దేశాన్ని అవమానించినట్టేనని కొందరు అభిప్రాయపడుతున్నారు. మరికొందరు మాత్రం భార్యగా బ్రిగెటి క్లోజ్‌గా మూవ్ అయ్యారని, దీనిలో తప్పేమి లేదని చెప్పారు.

పాకిస్థాన్ కోరితే కాల్పుల విరమణ..

మేం కోరితే చేయరా?

నంబాల కేశవరావు (ఫైల్)

మొదటిపేజీ తరువాయి...

నర్సింహారెడ్డి అలియాస్ విజయ్ అలియాస్ కృష్ణ మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సీపీఐ(మావోయిస్టు) పార్టీ దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ ప్రతినిధి వికల్ప్ పేరుతో సోమవారం సోషల్ మీడియా వేదికగా లేఖ విడుదలైంది. మారణకాండలో ఉద్యమ నేత బసవరాజుతోపాటు సీసీ స్టాఫ్ రాష్ట్ర కమిటీ స్థాయి కామ్రేడ్ నాగేశ్వరరావు అలియాస్ మధు అలియాస్ జంగ్ నవీన్, సీసీ సిబ్బంది సంగీత, భూమిక, వివేక్, సీపీవైపీసీ కార్యదర్శి కామ్రేడ్ చందన్ అలియాస్ మహేష్, సీపీవైపీసీ సభ్యులు గుడ్డు, లాల్సు, రమే, సూర్య, మాసే, కమల, నాగేశ్, రాగో, రాజేష్, రవి, సునీల్, సరిత, రేష్మ, రాజు, జమున, గీత, హుంగి, సంకి, భద్రు, నీలేష్, సంజు వీర మరణం పొందారని, వీరందరికీ విప్లవ జోహార్లతో నివాళులర్పిస్తూ, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతున్నట్లు లేఖలో పేర్కొన్నారు. మే 21 భారత విప్లవోద్యమ చరిత్రలో చీకటి రోజుగా మిగిలిపోతుందన్నారు.



మావోయిస్టు పార్టీ వికల్ప్ పేరుతో విడుదలైన లేఖ

చిత్రహింసలు పెట్టి నంబాల హత్య!

'నా గురించి కాదు.. యువ నాయకత్వం గురించి ఆలోచించండి. నా భద్రత కంటే.. విప్లవంలోని యువకుల భద్రత ముఖ్యం. మనం చనిపోయినా కూడా ఉద్యమం కొనసాగాలి. ఎప్పటికీ ఉద్యమం బలహీనంగా మారకూడదు. ఈ త్యాగాల స్ఫూర్తితో విప్లవం పునర్నిర్మించబడుతుందని నేను నమ్ముతున్నాను. మావోయిజం రెట్టింపు శక్తితో ఉద్భవిస్తుంది. ఈ ఫాసిస్టు ప్రభుత్వాన్ని ప్రజలే చిత్తుగా ఓడిస్తారు. ఈ ఉద్యమం మున్ముందు మరింత శక్తిమంతంగా మారాలి. మనవెంట ప్రజలు ఉన్నారు. మీరు సురక్షితంగా ఉండండి.. లాల్ సలామ్.. విప్లవం వర్ధిల్లాలి' అంటూ భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ప్రధాన కార్యదర్శి, కామ్రేడ్ నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు అలియాస్ భానుదాదా చివరిగా పలికినట్లు మావోయిస్టు దండకారణ్యం స్పెషల్ జోన్ కమిటీ సోమవారం లేఖను విడుదల చేసింది. నంబాలను బతికి ఉండగానే పట్టుకొని, చిత్రహింసలు పెట్టిన తర్వాత కాల్చి చంపారని లేఖలో స్పష్టం చేసింది. ఈ లేఖలో మే 21న జరిగిన ఎన్‌కౌంటర్‌లో మొత్తం 28 మావోయిస్టులు చనిపోయినట్లు అధికార ప్రతినిధి వికల్ప్ నిర్ధారించారు. నంబాలను కాపాడుకోవడానికి ఎంతో ప్రయత్నించి విఫలమైనట్లు మావోయిస్టులు తెలిపారు. మొత్తం ఆరు రోజుల పాటు సాగిన ఎన్‌కౌంటర్‌లో మొత్తం 35 మంది మావోయిస్టులు నంబాల కోసం చనిపోనియినట్లు చెప్పారు. నంబాల బృందంలో గతంలో పనిచేసిన ఆరుగురు ఇటీవల ప్రాణ భయంతో లొంగిపోయారని, ఆ కోవర్టులు ఇచ్చిన సమాచారంతోనే సాంకేతికంగా పోలీసులు తమను వేలాదిగా చుట్టుముట్టి కాల్పులకు తెగబడ్డారని చెప్పారు. 35 మందిలో 28 మంది చనిపోగా, ఏడుగురు ప్రాణాలతో బయటపడ్డారని తెలిపారు.

హెలికాప్టర్లు, డ్రోన్లతో బాంబుల వర్షం

ఆపరేషన్ కగార్‌లో భాగంగా ఆధునిక ఆయుధాలతో సాయుధులైన వేలాది బలగాలు తమపై డ్రోన్లు, హెలికాప్టర్లతో బాంబుల వర్షం కురిపించారని మావోయిస్టులు లేఖలో పేర్కొన్నారు. హెలికాప్టర్లతో వారికి తినడానికి తిండి, తాగడానికి నీరు అందించారని, తమకు అవేమీ లేకపోయినా కూడా వారితో 60 గంటల పాటు పోరాడామని తెలిపారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తమకు సహకరించకుండా వారి ఇండ్లను పోలీసులు ధ్వంసం చేశారని, అడ్డొచ్చిన ఆదివాసీలను చంపే ప్రయత్నం చేశారని ఆరోపించారు. అప్పటికే మృతిచెందిన మావోయిస్టుల మృతదేహాలను కుటుంబసభ్యులు తీసుకెళ్లకుండా బాంబులతో పేల్చారని, తుపాకులతో విచ్చలవిడిగా కాల్చారని చెప్పారు. ఈ దారుణ ఎన్‌కౌంటర్‌లో తమ అగ్రనేత నంబాల కేశవరావు, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సీనియర్ సభ్యుడు కామ్రేడ్ శివాజీ అలియాస్ డాక్టర్ రాజు సహా మొత్తం 28 మంది (నలుగురు మహిళా పార్టీ కేడర్లు) అమరులైనట్లు తెలిపారు. వారందరికీ శిరసు వంచి నివాళులు అర్పించినట్లు ప్రకటించారు.

40 రోజులు కాల్పుల విరమణ పాటించాం

నంబాల బృందంలోని కొందరు సభ్యులు లొంగిపోయిన దగ్గర్నుంచీ.. తమ వైపు పోలీసు బలగాలు వస్తాయనే అనుమానాలు ఉన్నట్లు మావోయిస్టులు లేఖలో పేర్కొన్నారు. 6 నెలలుగా కేశవరావు జాడను పసిగడుతున్నారని, ఆయన తమను ముందుండి నడిపించారని లేఖలో తెలిపారు. దాడులు జరుగుతాయని తెలిసినా కూడా కామ్రేడ్ నంబాల చెప్పినట్లు శాంతియుత చర్చల కోసం ఎదురుచూసినట్లు చెప్పారు. అందుకోసం 40 రోజులుగా ఎటువంటి చర్యలకు పాల్పడలేదని చెప్పారు. అయినా ప్రభుత్వ బలగాలు దాడులకు తెగబడ్డాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశం, దేశ సంపద, ప్రకృతి వనరులను కాపాడటానికి ప్రాణాలు అర్పించిన వీరులను దేశ ప్రజలు నిజమైన వీరులుగా గుర్తించాలని కోరారు. దేశ సంపదను కాపాడుతున్న వ్యక్తులపై నగరాల్లో కూర్చొని ఇష్టమొచ్చినట్లు మాట్లాడవద్దని హెచ్చరించారు. దేశంలో ఉంటూ, దేశ ద్రోహులుగా నిలుస్తున్నవారిని, దేశాన్ని కార్పొరేట్లకు అమ్ముతున్నవారిని బహిరంగంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్ట్ ప్రభుత్వం కుట్రపూరితంగా చేపట్టిన ఈ దారుణ హత్యాకాండలను దేశ ప్రజలు తీవ్రంగా ఖండించాలని కోరారు. విప్లవ ఉద్యమంలో అమరులైన కామ్రేడ్ల పాత్ర గురించి సెంట్రల్ కమిటీ ఒక పుస్తకాన్ని త్వరలో విడుదల చేస్తుందని తెలిపారు.

మావోయిస్టుల మృతదేహాలు కుళ్లిపోతున్నాయి!

- బాధిత కుటుంబాలకు అప్పగించాలి
- శాంతి సమన్వయ కమిటీ డిమాండ్
- తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలకు లేఖ

హైదరాబాద్, మే 26 (నమస్తే తెలంగాణ): ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టుల మృతదేహాలు కుళ్లిపోతున్నాయని, భౌతికకాయాలను వెంటనే తమకు అప్పగించాలని కుటుంబసభ్యులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు మృతదేహాలను కుటుంబసభ్యులకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలంటూ శాంతి సమన్వయ కమిటీ తెలంగాణ, ఏపీ రాష్ట్రాల ప్రభుత్వాలకు లేఖలు రాసింది. మృతదేహాలతో గౌరవప్రదంగా వ్యవహరించాలనే హక్కును ఉల్లంఘిస్తున్నారని కమిటీ సభ్యులు ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ జీ లక్ష్మణ్, ఎంఎఫ్ గోపీనాథ్, కవితా శ్రీవాత్సవ, క్రాంతి చైతన్య, మీనా కందస్వామి మండిపడ్డారు. ఛత్తీస్‌గఢ్ అబూజ్‌మడ్ ప్రాంతంలో మే 21న మరణించిన మావోయిస్టుల మృతదేహాలకు పోస్ట్‌మార్టం పూర్తిచేసి, మృతదేహాలను కుటుంబాలకు అప్పగిస్తామని ఛత్తీస్‌గఢ్ అడ్వకేట్ జనరల్ 2025 మే 24న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ముందు హామీ ఇచ్చారని, కానీ ఇప్పటికీ మృతదేహాలను ఇవ్వలేదని తెలిపారు. ఈ సుదీర్ఘ జాప్యం బాధిత కుటుంబాలకు మరింత ఆవేదన కలిగిస్తున్నదని చెప్పారు. మృతదేహాలను గౌరవంగా భద్రపరచాలనే చట్టపరమైన, నైతిక బాధ్యత ఉన్నప్పటికీ వాటిని కుళ్లిపోయేలా వదిలేశారనే ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నట్టు తెలిపారు. మృతదేహాలను తీసుకోవడానికి వెళ్లిన మావోయిస్టుల కుటుంబసభ్యులు, బంధువులతో అమానవీయంగా వ్యవహరించడం అధికారులు మానుకోవాలని హితవు పలికారు.

మావోయిస్టులతో శాంతిచర్చలు జరపాలి

సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ

హైదరాబాద్, మే 26 (నమస్తేతెలంగాణ): మావోయిస్టులపై జరుపుతున్న ఎన్‌కౌంటర్లను తక్షణమే ఆపి, శాంతిచర్చలు జరపాలని కేంద్ర ప్రభుత్వాన్ని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఇప్పటికే మావోయిస్టులు శాంతి చర్చల కోసం లేఖలను విడుదల చేయగా, కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమని అన్నారు. మావోయిస్టులు టెర్రరిస్టులు కాదని, వారూ మనదేశ పౌరులనే విషయాన్ని మర్చిపోవద్దని సూచించారు. తీవ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌తో చర్చలు జరిపిన కేంద్రం.. మావోయిస్టులతో చర్చలు జరిపితే తప్పేముందని ప్రశ్నించారు. ఇప్పటికైనా శాంతిచర్చలు జరపటానికి కేంద్రం చొరవచూపాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ముంబైలో 12 మంది మానవ బాంబులు!

- ఎన్ఐఏ విచారణలో వెల్లడించిన సిరాజ్, సమీర్
- ముంబైకి పయనమైన ఎన్ఐఏ, ఏటీఎస్ బృందాలు



సిరాజ్, సమీర్

హైదరాబాద్, మే 26 (నమస్తే తెలంగాణ) : ఉగ్ర లింకుల కేసులో ఎన్ఐఏ, పోలీసుల దర్యాప్తు వేగవంతంగా కొనసాగుతున్నది. సోమవారం నాటి విచారణలో ముంబైలోనే ప్రత్యేకంగా 12మంది మానవ బాంబులను తయారు చేసినట్లు సిరాజ్, సమీర్‌లు ఒప్పుకున్నట్లు తెలిసింది. దీంతో ఎన్ఐఏ, ఏటీఎస్ బృందాలు ముంబైకి వెళ్లినట్లు సమాచారం. విచారణలో వారు చెప్పిన సమాధానాల ఆధారంగా అక్కడ ప్రత్యేకంగా దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది. కాగా, 12 మంది నిందితులు పరారీలో ఉన్నట్లు సమాచారం. ఇక విజయనగరం ఉగ్ర కేసు రోజు రోజుకూ తీవ్ర రూపం దాల్చడంతో ఢిల్లీ నుంచి ఐబీ టీమ్ విజయనగరం చేరుకుంది. ఎన్ఐఏ, యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్, తెలుగు రాష్ట్రాల కౌంటర్ ఇంటెలిజెన్స్, ఎస్బీ బృందాలు విజయనగరంలో మకాం వేశాయి. మూడు రోజులుగా జరిగిన విచారణలో నిందితులు ముక్తసరిగా సమాధానాలు ఇచ్చారు. కాగా దేశ, విదేశాలకు సిరాజ్, సమీర్ నెట్ వర్క్ విస్తరించినట్లు విచారణ అధికారులు గుర్తించారు. ఇప్పటికే వరంగల్‌కు చెందిన పర్హాన్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన బాదర్, మరో ఆరుగురు కీలక నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సామాజిక మాధ్యమాలలో సిరాజ్, సమీర్‌లు జరిపిన చాటింగ్‌పై దర్యాప్తు బృందాలు ఓ అవగాహనకు వచ్చాయి. తెలుగు రాష్ట్రాల్లో ఉన్న స్లీపర్ సెల్స్ గురించి, వారి ఆర్థిక లావాదేవీలపై ఎన్ఐఏ అధికారులు మరింత లోతుగా ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తున్నది.

ముంబైని ముంచెత్తిన వాన

- 107 ఏండ్లలో ఎన్నడూ చూడని రికార్డు స్థాయి వర్షపాతం
- నీట మునిగిన నగరంలోని పలు అండర్ గ్రౌండ్ మెట్రో స్టేషన్లు
- రైలు, విమాన సర్వీసులకు తీవ్ర అంతరాయం
- ముంబై, థాణె, రాయగఢ్ జిల్లాలకు రెడ్ అలర్ట్

ముంబైలో నీట మునిగిన ఓ రోడ్డులో పాదచారుల అవస్థలు

వర్లీ మెట్రో స్టేషన్‌లో భారీగా వరద నీరు.

ముంబై: గడచిన 107 ఏండ్లలో ఎన్నడూ లేని విధంగా రికార్డుస్థాయిలో ముంబై నగరాన్ని వర్షం ముంచెత్తింది. ఆదివారం నుంచి ఎడతెరపి లేకుండా కురుస్తున్న వానకు అనేక ప్రాంతాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. అనేక చోట్ల రహదారులు చెరువులను తలపించాయి. రోడ్లు నీట మునిగిపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రైల్వే ట్రాకులపైకి వర్షపు నీరు చేరడంతో లోకల్ ట్రెయిన్ సర్వీసులకు ఆటంకం ఏర్పడింది. రెండు వారాల క్రితం ప్రారంభించిన ముంబై మెట్రో అండర్‌గ్రౌండ్ స్టేషన్‌ని వరద నీరు ముంచెత్తడంతో మెట్రో రైలు సర్వీసులు నిలిచిపోయాయి. గడచిన 25 ఏళ్లలో మొట్టమొదటిసారి రుతు పవనాలు ముందుగానే నగరంలోకి ప్రవేశించాయి. ముంబైతోపాటు పొరుగున ఉన్న థాణె, రాయగఢ్ జిల్లాలకు రెడ్ అలర్ట్ ప్రకటించారు. ఆదివారం రాత్రంతా కురిసిన వర్షానికి కొత్తగా ప్రారంభించిన ఆచార్య ఆత్రే చౌక్ అండర్‌గ్రౌండ్ మెట్రో స్టేషన్ నీట మునిగింది. మూడు ప్రధాన లైన్లు సెంట్రల్, వెస్టర్న్, హార్బర్‌లో లోకల్ రైలు సర్వీసులు ఆలస్యంగా నడుస్తున్నాయి. ముంబై విమానాశ్రయంలో 250కి పైగా విమాన సర్వీసులకు అవరోధం ఏర్పడింది.

కేరళలో భారీ వర్షాలు

కేరళలోని ఉత్తర జిల్లాలను భారీ వర్షం ముంచెత్తుతున్నది. లోతట్టు ప్రాంతాల ప్రజలను సహాయ శిబిరాలకు, ఇతర సురక్షిత ప్రాంతాలకు తరలించారు. త్రిసూర్ జిల్లాలో పెద్ద సంఖ్యలో చెట్లు కూలిపోవడంతో ట్రాఫిక్‌కి తీవ్ర అంతరాయం ఏర్పడింది. త్రిసూర్-గురువాయూర్ రైలు మార్గంపై ఓ భారీ వృక్షం విరిగిపడడంతో దాన్ని తొలగించేందుకు రైల్వే సిబ్బంది తీవ్రంగా శ్రమిస్తున్నారు. పెనుగాలులతో కూడిన భారీ వర్షం కారణంగా పాలక్కాడ్ జిల్లాలో అనేక చోట్ల ప్రజలు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఆదివారం నుంచి నిర్విరామంగా వర్షం కురుస్తుండడంతో పొరుగున కోజిక్కోడ్ జిల్లాలో అనేక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పలు నదుల ఒడ్డున నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. ఇడుక్కి, కొట్టాయం, ఎర్నాకుళం, త్రిస్సూర్, పాలక్కాడ్, మలప్పురం, కోజిక్కోడ్, వయనాడ్, కన్నూర్ జిల్లాలలో గంటకు 60 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులతో కూడిన భారీ వర్షాలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరించింది.

కోస్తా కర్ణాటకలో రెడ్ అలర్ట్

వరుసగా మూడవరోజు కర్ణాటకలోని కోస్తా తీర ప్రాంతాలను భారీ వర్షాలు ముంచెత్తాయి. దక్షిణ కన్నడ జిల్లాలో ప్రజా జీవనం స్తంభించింది. ఆ ప్రాంతాలలో రెడ్ అలర్ట్ ప్రకటించిన అధికారులు ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలను మోహరించారు. ఐదు రోజుల వరకు రెడ్ అలర్ట్ కొనసాగుతుందని ఐఎమ్‌డీ తెలిపింది. మంగళూరు నగరంలోని అనేక ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి.

పాక్‌లో జ్యోతికి ఆరుగురు గన్‌మెన్లు!

స్కాటిష్ యూట్యూబర్ వెల్లడి



న్యూఢిల్లీ: పాక్‌కు గూఢచార్యం చేస్తూ పట్టుబడిన హర్యానా యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా విషయంలో రోజురోజుకూ ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా ఆమెపై స్కాటిష్ యూట్యూబర్ కల్లమ్ మిల్ సంచలన విషయం వెల్లడించారు. పాకిస్థాన్‌లోని లాహోర్ అనార్కలీ బజార్‌లో ఆమె వెంట ఏకే 47లను కలిగిన ఆరుగురు గన్‌మెన్లను చూసినట్టు చెప్పాడు. పాకిస్థాన్ ఇంటెలిజన్స్‌తో ఆమె సాన్నిహిత్యంగా ఉంటున్నట్టు గుర్తించిన హర్యానా పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ముందుగా విధించిన నాలుగు రోజుల కస్టడీ ముగియడంతో, న్యాయస్థానంలో హాజరపరిచారు. సోమవారం ఆమెను మరో 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి కోర్టు అప్పగించింది. కాగా స్కాటిష్ యూట్యూబర్ విడుదల చేసిన తాజా వీడియోలో ఆయన పాకిస్థాన్‌లోని అనార్కలి బజార్‌లో జ్యోతి మల్హోత్రాతో మాట్లాడుతున్నారు. ఇందులో ఆమె 'మొదటిసారి పాకిస్థాన్ వచ్చారా' అంటూ కల్లమ్‌ను ప్రశ్నిస్తున్నది. 'లేదు.. ఇది ఐదోసారి' అంటూ ఆయన సమాధానమిచ్చారు. తాను ఇండియన్‌ను అంటూ ఆమె పరిచయం చేసుకుంది. అయితే పాకిస్థాన్ ఆతిథ్యం గురించి జ్యోతిని కల్లమ్ ప్రశ్నించగా గొప్పగా ఉందంటూ ఆమె సమాధానమిచ్చింది. అయితే ఆమె వెంట ఆరుగురు సాయుధులైన పోలీసులు ఉండడం తనను ఆశ్చర్యానికి గురిచేసిందని ఆయన చెప్పుకొచ్చాడు.

పాక్‌కు సమాచారం లీక్.. సీఆర్‌పీఎఫ్ జవాన్ అరెస్ట్

ఎన్ఐఏ కస్టడీకి అప్పగింత

న్యూఢిల్లీ: సెంట్రల్ రిజర్వు పోలీసు దళం (సీఆర్‌పీఎఫ్) జవాను మోతీ రామ్ జాట్‌ను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అరెస్ట్ చేసింది. ఆయనను న్యూఢిల్లీలోని పాటియాలా హౌస్‌లోని ప్రత్యేక ఎన్ఐఏ కోర్టు వచ్చే నెల 6 వరకు ఎన్ఐఏ కస్టడీకి ఆదేశించింది. ఎన్ఐఏ విడుదల చేసిన ప్రకటనలో తెలిపిన వివరాల ప్రకారం, మోతీ రామ్ 2023 నుంచి పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ సంస్థకు భారత దేశ భద్రతకు సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని రహస్యంగా పంపిస్తున్నాడు. అందుకు బదులుగా పాకిస్థానీ సంస్థ నుంచి వివిధ మార్గాల్లో నిధులు తీసుకుంటున్నాడు. ఈ ఆరోపణలు దేశ భద్రత, భారతీయులు, దేశానికి వచ్చే ప్రజల ప్రాణాలపై ప్రభావం చూపుతాయని ప్రత్యేక కోర్టు వ్యాఖ్యానించింది.

దోస్త్.. మేరా దోస్త్

పక్షుల్లోనూ దీర్ఘకాల మైత్రి

న్యూయార్క్, మే 26: మనుషులు తరచుగా ఒకరికొకరు సహకరించుకోవడం సాధారణమే. బంధుత్వం, పరస్పర సంబంధం లేకున్నా ఈ సహకారం కనిపిస్తూనే ఉంటుంది. ఇలాంటి సహకారం జంతువుల మధ్య కూడా ఉంటుందని నిరూపించడం చాలా కష్టం. కానీ, మనుషుల మాదిరిగా కొన్ని రకాల పక్షులు సైతం పరస్పరం సహకరించుకుంటాయని తాజా అధ్యయనంలో తేలింది. ఈ అధ్యయనంలో భాగంగా ప్రొఫెసర్ డస్టిన్ రుబెన్‌స్టెయిన్ ల్యాబ్ మాజీ పీహెచ్‌డీ విద్యార్థి అలెక్సిస్ ఎర్ల్ నేతృత్వంలోని పరిశోధకుల బృందం ఏకంగా 20 ఏండ్లపాటు ఆఫ్రికన్ స్టార్లింగ్ పక్షుల తీరును పరిశీలించింది. మానవుల మాదిరిగానే ఆ పక్షులు కూడా ఒకదానికొకటి సహకరించుకుంటాయని, సాటి పక్షికి సాయపడితే దాని నుంచి భవిష్యత్తులో తనకూ సాయం అందుతుందన్న అవగాహనతో ఆఫ్రికన్ స్టార్లింగ్స్ మధ్య పరస్పర సహకారం కొనసాగుతుందని ఈ పరిశీలనలో తేలింది. స్టార్లింగ్ సమూహాలు కేవలం సాధారణ కుటుంబాలు మాత్రమే కాదని, అవి చాలా సంక్లిష్టమైనవని, వాటి మధ్య సంబంధం ఉన్నా, లేకున్నా మనుషుల మాదిరిగా దీర్ఘకాల మైత్రితో కలిసే జీవిస్తూ పరస్పరం సహకరించుకుంటాయని రుబెన్‌స్టెయిన్ వివరించారు.

గాలిని కాదు.. కరెంట్‌ను పీల్చే బ్యాక్టీరియా!

రైస్ యూనివర్సిటీ పరిశోధకుల గుర్తింపు

హూస్టన్ (అమెరికా), మే 26: జీవ సాంకేతిక శాస్త్రాన్ని, శక్తి వ్యవస్థలను మార్చేయగలిగే ఆశ్చర్యకరమైన మనుగడ వ్యూహాన్ని పరిశోధకులు కనుగొన్నారు. విచిత్రంగా కొన్ని రకాల బ్యాక్టీరియాలు ఆక్సిజన్‌కు బదులుగా విద్యుత్తును పీల్చుకుని జీవిస్తాయని హ్యూస్టన్‌లోని రైస్ యూనివర్సిటీ జీవశాస్త్రవేత్త కరోలిన్ అజో-ఫ్రాంక్లిన్ నేతృత్వంలోని పరిశోధకుల బృందం గుర్తించింది. సహజ ప్రక్రియ ద్వారా ఆ బ్యాక్టీరియాలు ఎలక్ట్రాన్‌లను తమ పరిసరాల్లోకి నెట్టి విద్యుత్తును ఉత్పత్తి చేస్తాయని, తద్వారా ఆ విద్యుత్తునే శ్వాసించి మనుగడ సాగిస్తాయని ఆ బృందం తేల్చింది. క్లీన్ ఎనర్జీ, ఇండస్ట్రియల్ బయోటెక్నాలజీ రంగాల్లో కొత్త పరిణామాలకు దోహదపడే ఈ పరిశోధన వివరాలు 'సెల్'లో ప్రచురితమయ్యాయి. జీవశాస్త్రాన్ని, విద్యుత్తు రసాయన శాస్త్రంతో విలీనం చేసి శ్వాసక్రియను కొనసాగించగలిగే ఈ సూక్ష్మజీవుల ప్రత్యేక సామర్థ్యాన్ని ఉపయోగించుకుని భవిష్యత్ సాంకేతికతలకు పునాది వేసేందుకు వీలుంటుందని పరిశోధకులు చెప్తున్నారు.

పిల్లి మెడకు డ్రగ్స్ కట్టి!

కోస్టారికా జైల్లో ఊహించని క్రైమ్ థిల్లర్!



కోస్టారికా: కోస్టారికా జైల్లో జరిగిన ఈ క్రైమ్ థిల్లర్‌ను ఎవరూ ఊహించి ఉండరు! పిల్లి ద్వారా ఏకంగా జైల్లో డ్రగ్స్‌ను స్మగ్లింగ్ చేయడం చూసి జైలు అధికారులు షాక్‌కు గురయ్యారు. పిల్లికి కట్టిన ప్లాస్టిక్ పొట్లాల్లో 230 గ్రాముల గంజాయి, 67 క్రాక్ కొకైన్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. జైల్లోని ఖైదీల కోసం పిల్లి ద్వారా మత్తు మందుల స్మగ్లింగ్ జరిగిందని కోస్టారికా న్యాయశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. 'చురుకైన అధికారుల అప్రమత్తతకు కృతజ్ఞతలు. పిల్లిని పట్టుకోగలిగారు. దాని వల్ల ఆ డ్రగ్స్ లక్ష్యాన్ని చేరుకోకుండా అడ్డుకున్నారు' అని ఆ ప్రకటన పేర్కొంది. అధికారులు పిల్లిని 'అరెస్ట్' చేయగానే అది మౌనంగా ఉండిపోయింది. మత్తు మందు పాకెట్లను కత్తెరతో కట్ చేస్తున్నప్పుడు ఒళ్లు విరుచుకొని విశ్రాంతి తీసుకుంది. వైద్య పరీక్షలు, సంరక్షణ నిమిత్తం ఆ పిల్లిని జంతువుల ఆరోగ్య సేవల విభాగానికి అప్పగించారు.

చైనాలో రోబోల బాక్సింగ్ మ్యాచ్

మనుషుల్లా తలపడిన హ్యూమనాయిడ్ రోబోలు

బీజింగ్, మే 26: చరిత్రలో తొలిసారిగా చైనాలో రోబోల బాక్సింగ్ టోర్నమెంట్ నిర్వహించారు. 'యునిట్రీ రోబోటిక్స్' సంస్థ తయారుచేసిన 1.32 మీటర్ల ఎత్తున్న జీ1 హ్యూమనాయిడ్ రోబో.. బాక్సింగ్ పోటీల్లో విజేతగా నిలిచింది. జిజియాంగ్ ప్రావిన్స్‌లోని హ్యాంగ్జౌ వేదికగా రోబోల బాక్సింగ్ పోటీలు నిర్వహించగా, బాక్సింగ్ రింగ్‌లో ఇద్దరు మనుషుల వలే రోబోలు కొట్టుకున్నాయి. ఒకదానిపై మరొటి ముష్టిఘాతాలు కురిపించుకున్నాయి. మిషా ఫైటింగ్ సిరీస్.. పేరుతో నిర్వహించిన పోటీల్లో రోబోల బ్యాటరీ, ఇతర మెటీరియల్‌కు పరిమితులు విధించారు. ప్రత్యేకమైన ఈ టోర్నమెంట్‌లో నలుగురు మానవ ఆపరేటర్లు జట్లుగా ఏర్పడి.. రోబోలకు మార్గనిర్దేశం చేశారు. వేగవంతమైన పరిస్థితులలో రోబోల అధిక పీడన సామర్థ్యాలను, వాటి స్థితిస్థాపకతను పరీక్షించడానికి, చైనా ఏఐ శక్తిసామర్థ్యాల ప్రదర్శనకు ఈ పోటీ ఒక వేదికగా నిలిచింది.

చీకట్లోనూ చూడగలిగే 'కాంటాక్ట్ లెన్స్'

తయారు చేసిన చైనా శాస్త్రవేత్తలు

బీజింగ్, మే 26: చీకట్లో సైతం మనం కంటితో చూడగలిగే 'ఇన్‌ఫ్రారెడ్ కాంటాక్ట్ లెన్స్'ను యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆఫ్ చైనా సైంటిస్టులు తయారు చేశారు. మరో ప్రత్యేకత ఏంటంటే, ఈ కాంటాక్ట్ లెన్స్‌ను ధరించిన వాళ్లకు.. కను రెప్పలు మూసుకున్నా కండ్ల ముందున్నది కనపడుతుంది. పరారుణ కాంతి కిరణాలను దృశ్య తరంగాలుగా మార్చి కంటిలోపలికి చేర్చుతాయి కాబట్టి వీటిని ఇన్‌ఫ్రారెడ్ లెన్స్ (పరారుణ కటకాలు)గా పిలుస్తారు. ఇవి కనురెప్పను దాటి కంటి లోపలికి వెళ్లగలవు. దీనివల్లే కను రెప్ప మూసినా.. ముందున్నది చూడగలుగుతారు. కొన్ని రకాల పాలిమర్స్, నానోపార్టికల్స్‌తో ఈ లెన్సెస్‌ను సైంటిస్టులు రూపొందించారు. ఈ టెక్నాలజీని దట్టమైన పొగమంచు, దుమ్ముతో కూడిన వాతావరణం, రక్షణ, అత్యవసర సమయాల్లో వాడొచ్చునని అధ్యయనం పేర్కొన్నది. తొలుత ఎలుకలపై చేసిన ప్రయోగాలు ఫలితాల్ని ఇవ్వటంతో మానవులపైనా ట్రయల్స్ నిర్వహించినట్టు పరిశోధకులు తెలిపారు.

ఒక యూనిట్ విద్యుత్తుకు ఒక్క రూపాయే!

సరికొత్త సోలార్ సెల్ టెక్నాలజీ అభివృద్ధి చేసిన ఐఐటీ బాంబే



ముంబై, మే 26: విద్యుత్తు వినియోగం గణనీయంగా పెరిగిన క్రమంలో వినియోగదారులకు నెలవారీ విద్యుత్తు బిల్లులు షాక్ ఇస్తున్నాయి. దీనికి పరిష్కారం చూపుతూ, ఒక్క రూపాయితో ఒక విద్యుత్తు యూనిట్‌ను పొందే విధంగా సరికొత్త సోలార్ సెల్ టెక్నాలజీని ఐఐటీ-బాంబే సైంటిస్టులు అభివృద్ధి చేశారు. ఎక్కువ మొత్తంలో సౌర కాంతిని గ్రహించుకోగల 'టాండెమ్ సోలార్ సెల్'ను వారు ఆవిష్కరించారు. తక్కువ కాంతిలోనూ పనిచేయగల ఈ సోలార్ సెల్ నుంచి విద్యుత్తు ఔట్‌పుట్ 30శాతం వరకు ఉంటుందని చెబుతున్నారు. ప్రస్తుతం వాడుతున్న స్టాండర్డ్ సోలార్ ప్యానెల్స్ 20శాతం సౌరశక్తిని మాత్రమే విద్యుత్తు శక్తిగా మార్చగలవు. అంతేగాక వీటిలో ఒక యూనిట్ విద్యుత్తుకు రూ.2.50 నుంచి రూ.4 వరకు ఖర్చు అవుతుంది. 2027నాటికల్లా టాండెమ్ సోలార్ సెల్ అమ్మకాలు మొదలవుతాయని తెలిసింది. విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న ముడి సరుకులతో మనదేశంలో ఆయా కంపెనీలు సోలార్ సెల్స్‌ను తయారుచేస్తున్నాయి. ప్రధానంగా చైనా నుంచి ఎక్కువగా దిగుమతి అవుతాయి. దీనికి పరిష్కారంగా, దేశీయంగా లభించే ముడి పదార్థాలతోనే 'టాండెమ్ సోలార్ సెల్'ను తయారుచేయవచ్చునని పరిశోధకులు చెబుతున్నారు.